క్లుప్తంగా

సన్మానం



వెంకటరాజును సన్మానిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ హైకోర్టు న్యాయవాదిగా నియమితులైన వెంకటరాజుని సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. మండల పరిధి గుండ్లపల్లికి సీనియర్ న్యాయవాది వెంకటరాజుని ప్రభుత్వం హైకోర్టు న్యాయవాదిగా నియమించింది. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్‌తో పాటు నాయకులు బాసంపల్లి శ్రీనివాస్‌గౌడ్, జంగం వెంకటేష్, కొడకంచి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

జీఓ నంబర్ 10ని రద్దు చేయాలి

నర్సాపూర్: అంగన్‌వాడీలకు నష్టం కలిగించే జీఓ 10ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపుమేరకు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం కార్యాలయ గేటుకు వినతి పత్రం అంటించారు. టీచర్‌కు రెండు లక్షలు, ఆయాకు ఒక లక్షతో రిటైర్మెంట్ బెనిఫిట్‌తో పాటు నెలకు ఐదు వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహేందర్‌రెడ్డి, అన్నపూర్ణ, నాగరాజు, మంజుల, సురేష్, రేణుక, పుష్ప పాల్గొన్నారు.

అమ్మవారికి అభిషేకం

చేగుంట(తూప్రాన్): వారాహి నవరాత్రి పూజల్లో భాగంగా సోమవారం చేగుంట మహంకాళీ ఆలయంలో ఫల పంచామృత అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ఫల పంచామృత అభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి రాఘవేంద్రశర్మ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి, బూరుగడ్డ గ్రామాలలో సోమవారం 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్లు ఇంటింటికీ తిరుగుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతో విద్య నేర్పడం తోపాటు పౌష్టికాహారం అందిస్తామని.. పిల్లలను పంపించాలని కోరారు. కార్యక్రమలో అంగన్‌వాడీ టీచర్లు ఫరీద, కమల, సుమిత్ర, నిర్మల, రజియా, భద్రావతి పాల్గొన్నారు.

దైవ చింతనతో సకల సంతోషాలు



మాట్లాడుతున్న మాధవానంద సరస్వతి

పాపన్నపేట(మెదక్): దైవ చింతనతో సకల సంతోషాలు కలుగుతాయని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి కేదారీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో మాట్లాడుతూ.. భగవంతుని స్మరణతో జీవన శైలిలో మార్పు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు రాజశేఖరశర్మ, శ్యాంసుందర్ శర్మ, ఇంద్రసేనారెడ్డి, నర్సింలు గుప్త, ఎర్రం రవీందర్, యాబన్న, నారాయణ, హరికుమార్, సాయిబాబ, మహేందర్, దీపక్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రీస్కూల్‌లో చేర్పించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రెండున్నర ఏళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో గల ప్రీస్కూల్‌లో చేర్పించాలని చిలప్‌చెడ్ మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట అంగన్‌వాడీ బాటలో భాగంగా గ్రామాల వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అమ్మబాట అంగన్‌వాడీ–అంగన్‌వాడీ బాట ఈనెల 20 వరకు కొనసాగుతోందన్నారు. చిన్నారులను ప్రీస్కూల్‌లో చేర్పించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్స్ వ్యవస్థ.. అస్తవ్యస్తం

మరమ్మతులు చేపట్టినా ఫలితం శూన్యం

- నాణ్యతా ప్రమాణాలు పాటించరా?
- వాహనదారుల అయోమయం



నర్సాపూర్ చౌరస్తాలో సిగ్నల్స్ పని చేయకపోవడంతో అడ్డదిడ్డంగా వెళుతున్న వాహనదారులు

నర్సాపూర్: నర్సాపూర్ చౌరస్తాలో ట్రాఫిక్‌ను అదుపు చేసేందుకు ఏర్పాటు చేసిన సిగ్నల్స్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. నెలల తరబడి పనిచేయకపోవడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు వారం రోజుల క్రితమే మరమ్మతులు చేయించారు. కానీ.. మూడు, నాలుగు రోజుల నుంచి సిగ్నల్స్ సరిగా పని చేయకపోవడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

నాణ్యత పాటించకుండా పనులు

సిగ్నల్స్‌కు మరమ్మతు పనులను మొక్కుబడిగా చేయించారని, నాణ్యత లోపించిందని, రిపేరు చేసిన వారంలోపే అవిసరిగా పనిచేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. సిగ్నల్స్ ఒక్కోసారి నాల్గు దిక్కులా రెడ్‌లైట్ రావడంతో చౌరస్తాలోని అన్ని మార్గాలలో ఉండే వాహనదారులు అయోమాయానికి గురవుతున్నారు. అన్నివైపులా రెడ్‌లైట్స్ వస్తే ఎవరు ముందుగా వెళ్లాలో అర్థం కావడంలేదనిచ సిగ్నల్స్ వద్ద టైమింగ్ రావడం లేదని, అవి ఎప్పుడు పని చేస్తాయో ఎప్పుడు పని చేయవో తెలియడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాణ్యతగా మరమ్మతులు పనులు చేపట్టి సిగ్నల్స్ వ్యవస్థను బాగుచేయించాలని వాహనదారులు కోరుతున్నారు. పని చేయనందున ఎవరికి వారు అడ్డదిడ్డంగా తమ వాహనాలు నడుపుతున్నారు. అన్ని వైపుల నుంచి వాహనాలు రావడంతో కూడలిలో ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ కమిషనర్ వివరణ

మరమ్మతులు చేసిన వారంలోపే సిగ్నల్స్ సరిగా పని చేయని విషయాన్ని మున్సిపల్ కమిషనర్ జైత్‌రాంనాయక్ దృష్టికి తీసుకుపోగా అవి సరిగా పనిచేయని విషయం తన దృష్టికి రాలేదని చెప్పారు. తాను పరిశీలిస్తానని ఆయన తెలిపారు.

ఘనపురం ఆయకట్టుకు నీరివ్వండి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

మెదక్ కలెక్టరేట్: కొల్చారం మండలం ఘనపురం ఆయకట్టు రైతులకు నీరందివ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశంగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశంగౌడ్ మాట్లాడుతూ మండలంలోని రైతులంతా ఘనపురం ఆయకట్టును నమ్ముకొని వరినాట్లు వేసుకుంటున్నారని తెలిపారు. వర్షాలు లేనందున రైతులు నాట్లు వేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆయకట్టు నుంచి నీరు విడుదల చేయించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కోశాధికారి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న హెచ్‌పీసీఎల్ సిబ్బంది

డాక్టర్ చంద్రశేఖర్

మెదక్‌జోన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. హెచ్‌పీసీఎల్ సిబ్బంది సుమారు 25మంది రక్తదానం చేశారు. రక్తదానంచేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో మేనేజర్ బల్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాను అడ్డుకున్న అధికారులు



ప్రహరీని జేసీబీతో కూల్చివేయిస్తున్న అధికారులు

తూప్రాన్: మండలంలోని యావపూర్ సమీపంలోని సూర్ణమ్మ కుంట కట్ట కబ్జాను ఇరిగేషన్ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. కొందరు కట్టను కబ్జా చేసి ప్రహరీ నిర్మించారు. ఈ విషయమై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ శ్రీధర్, ఏఈ అనురాధ కుంట కట్ట కబ్జాను ప్రహరీని కూల్చివేశారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి



శివ్వంపేట(నర్సాపూర్): తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

శివ్వంపేట(నర్సాపూర్): భూ సమస్యల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ షఫీయొద్దీన్ అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించగా భూ సమస్యలపై 3 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రజావాణి ప్రారంభించి రెండు వారాలైన ఎలాంటి ఫిర్యాదులు రాలేవన్నారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలున్నా సోమవారం ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు నిర్వహించే ప్రజావాణిలో నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమస్యలు తమ దృష్టికి వస్తేనే పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెండు దరఖాస్తులు వచ్చాయి. ప్రధాన రహదారిపై ఎక్కడపడితే అక్కడ చికెన్ సెంటర్లు, మటన్ షాపులు ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని చక్రపాణి దరఖాస్తు అందించారు. చికెన్, మటన్‌షాపులను ఒక నిర్దిష్ట స్థలంలో ఏర్పాటు చేసి ప్రజల ఇక్కట్లు తొలగించాలని దరఖాస్తులో కోరారు. ఎనిమిదో వార్డులో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు దరఖాస్తు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వప్న, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, ఎంపీఓ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 98 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెండు పడకల ఇళ్లకు సంబంధించి 51, భూసంబంధిత సమస్యలపై 10, ఇతర సమస్యలకు సంబంధించి 37 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ రజనీకుమారి పేర్కొన్నారు.

నర్సాపూర్: తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నాలుగు దరఖాస్తులు వచ్చాయని ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డి చెప్పారు. భూముల సమస్యలను ధరణిలో పరిష్కరించాలని రైతులు దరఖాస్తు చేశారని ఆయన వివరించారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్‌డీఓ తెలిపారు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

రామాయంపేట(మెదక్): పట్టణంలోని 1వ వార్డులో (దళితవాడ) రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. ఆ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వార్డులో మాల, మాదిగలతోపాటు బీసీ కులాలకు చెందిన 18 వందలకు పైగా జనాభా ఉందన్నారు. ఇక్కడ దుకాణం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రతి నెలా రేషన్ తీసుకోవడానికి సుమారుగా 2 కి.మీ దూరం వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. దుకాణాన్ని కాలనీలోనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై అధికారులు దళితుల పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన భైరం కుమార్, శంకర్, భాస్కర్, శంకరయ్య పేర్కొన్నారు.

మృతురాలి కుటుంబానికి సాయం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన బాజ లావణ్య అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటు వేయడానికి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమె ఇద్దరి చిన్నారుల భవిష్యత్ కోసం మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సతీమణి వాణి ఈ నగదు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటగౌడ్, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నాయకుల అరెస్ట్ అప్రజాస్వామికం

చిన్నశంకరంపేట(మెదక్): నిరుద్యోగ సమస్యలపై చలో సెక్రటేరియెట్‌కు తరలివెళ్లకుండా విద్యార్థి, యువజన సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు విమర్శించారు. అరెస్టయిన నాయకులకు సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగుల డిమాండ్ మేరకు గ్రూప్ వన్ పరీక్షలు వాయిదా వేయాలని, ఉద్యోగ నియామకాల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, నరేశ్, రాజ్‌కుమార్, గోపాల్‌నాయక్, సుధాకర్ ఉన్నారు.

నైపుణ్యాలతోనే ఉపాధి

మనోహరాబాద్(తూప్రాన్): యువత నైపుణ్యాలతో ఉపాధిని పొందవచ్చునని ఎస్ఐ సుభాష్‌గౌడ్ అన్నారు. సోమవారం దండుపల్లి ఐటీసీ ఎంఎస్‌కే ప్రథమ్ ఎడ్యూకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ యూత్ స్కిల్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతకు ఉచిత శిక్షణ అందించి వారికి ఉపాధిని కల్పించడం గొప్ప విషయం అన్నారు. పరిసర గ్రామాల యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పీఎసీఎస్ చైర్మన్ బాలకృష్ణరెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన బీజేపీ నేతలు

చేగుంట(తూప్రాన్): ఎంపీ రఘునందన్‌రావును మండల బీజేపీ నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా సోమవారం కలిసినట్లు మండల శాఖ అధ్యక్షుడు భూపాల్ తెలిపారు. ఎంపీని కలిసి మండలంలోని సమస్యలను గురించి ఆయన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. చేగుంట–మెదక్ రోడ్డులో రైల్వేగేటు వద్ద బ్రిడ్జి, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేయాలని ఎంపీని కోరినట్లు భూపాల్ తెలిపారు. కలిసిన వారిలో ఎల్లారెడ్డి, సంతోష్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, రతన్, శ్రీనివాస్, గోవింద్, నాగభూషణం తదితరులు ఉన్నారు.

నంబర్ ప్లేట్లు లేని వాహనాలు సీజ్

నర్సాపూర్ రూరల్: నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్లపై వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని నర్సాపూర్ ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. సోమవారం నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసి చలాన్లు విధించారు. వాహనాల యజమానులతో నంబర్ ప్లేట్లు వేయించి వారికి వాహనాలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అన్ని రకాల వాహనాలకు నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకొని రోడ్లపై నడపాలని సూచించారు. దీంతోపాటు త్రిబుల్ రైడింగ్ నిబంధనలు పాటించకుండా పార్కింగ్, డ్రైవింగ్‌లను పాటించకుండా వాహనదారులపై కఠిన చర్యలు తప్పవన్నారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తం

సీఐ వెంకట్ రాజాగౌడ్

రామాయంపేట(మెదక్): ప్రజలు సైబర్ నేరాల విషయమై జాగ్రత్తగా ఉండాలని సీఐ వెంకట్‌రాజా గౌడ్ సూచించారు. సోమవారం సాయంత్రం సర్కిల్ కార్యాలయంలో జరిగిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్‌లో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. బెట్టింగులు, జూదం, మట్కా విషయమై కఠిన చర్యలు తీసుకుంటామని, నిర్వాహకులు వెంటనే ఆపేయాలని హెచ్చరించారు. మైనర్లకు, చిన్నపిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇస్తే పిల్లల తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. నంబర్ ప్లేట్‌లేని వాహనాలను సీజ్ చేస్తామని, ప్రతి వాహనానికి బీమా తప్పనిసరని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన

టేక్మాల్(మెదక్): ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని బొడ్మట్‌పల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం పోలీస్ కళాబృందంచే విద్యార్థులకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. సమాజంలో మత్తు పదార్థాలు, గంజాయి నివారణ, ఆడపిల్లల అక్రమ రవాణా, సెల్‌ఫోన్ వినియోగం వల్ల ఉపయోగాలు–నష్టాల గురించి పాటల ద్వారా విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం సుజాత, ఏఎస్ఐ దయానంద్, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ సురేందర్ పాల్గొన్నారు.

శాంతి కమిటీ సమావేశం

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో సోమవారం స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17న ఏకాదశి, మొహర్రం పండుగలను పురస్కరించుకొని గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరుగకుండా చూడాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వేణు గోపాల్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీపై అంగన్‌వాడీలకు శిక్షణ



మాట్లాడుతున్న హేమభార్గవి

పెద్దశంకరంపేట(మెదక్): అంగన్‌వాడీ కేంద్రాలలో 5 ఏళ్ల లోపు చిన్నారులకు ఆటపాటలతో పాటు ఇంగ్లిష్ మీడియం బోధన చేపట్టాలని సీడీపీఓ హేమభార్గవి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలోని రైతు వేదికలో అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేట మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమభార్గవి మాట్లాడుతూ ప్రీప్రైమరీ విధానంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, అంగన్‌వాడీల బలోపేతానికి సహకరించాలన్నారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

• పీర్ల ఊరేగింపు



శివ్వంపేటలో పీర్ల ఊరేగింపు

మొహర్రం వేడుకల్లో భాగంగా మండలకేంద్రంలోని శివ్వంపేట, గుడూర్‌లలో సోమవారం పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

– శివ్వంపేట(నర్సాపూర్)

మొక్కల సంరక్షణ చేపట్టాలి



శివ్వంపేట(నర్సాపూర్): మొక్కలు నాటుతున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి పరిరక్షణకు బాధ్యత తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి నర్సయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల ఉన్నత పాఠశాలలో వన మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మొక్కలు నాటి నీరు పోశారు. పచ్చదనం పరిరక్షణ కోసం ప్రభుత్వం ఉచితంగా మొక్కలు ఇవ్వడం జరుగుతుందని, ప్రజలు వాటిని తీసుకెళ్లి నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నవీన్‌కుమార్, ఎంఈఓ బుచ్చనాయక్, ఇంచార్జ్ హెచ్‌ఎం ఇందుమతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు మొక్కలు నాటాలి

వెల్దుర్తి(తూప్రాన్): భావి తరాలు కాలుష్యం బారిన పడకుండా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి పిలుపునిచ్చారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో గిర్దావర్ ధన్‌సింగ్, ఉపాధ్యాయులు రంగారెడ్డి, రాజేశ్వర్‌రావ్, హరిరంజన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నార్సింగిలో వనమహోత్సవం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం జప్తి శివనూర్, భీమ్‌రావుపల్లి గ్రామాలలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ రాజేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ నార్సింగి మండలంలో వన మహోత్సంలో 34 వేల మొక్కలను నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రతి ఇంటికి ఐదు మొక్కలను అందిస్తున్నట్లు చెప్పారు. విలువైన డ్రాగన్ మొక్కలు, జామ, బొప్పాయి, గలాబీ మొక్కలను ఇంటి ఆవరణలో నాటి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ విరిగిన విద్యుత్ స్తంభం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి చెట్టు పడటంతో విద్యుత్ స్తంభం విరిగింది. దీంతో నార్సింగిలో విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉదయం ట్రాన్స్‌కో సిబ్బంది స్తంభాన్ని సరిచేసి విద్యుత్ సరాఫరాను పునరుద్ధరించారు.

◆ ముందస్తు అరెస్టు

నర్సాపూర్: సచివాలయం ముట్టడికి సోమవారం బీఆర్‌ఎస్ యువజన విభాగం పిలుపు ఇవ్వడంతో పట్టణంలోని పలువురు బీఆర్‌ఎస్ యూత్ నాయకులను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు పట్టణానికి చెందిన శ్రీకాంత్, అజార్‌లతోపాటు పలువురిని అదుపులోకి తీసుకొని మధ్యాహ్నం తర్వాత సొంతపూచి కత్తుపై విడిచిపెట్టినట్లు పోలీసులు తెలిపారు.

◆ చికిత్స పొందుతూ యువకుడు మృతి

చిన్నశంకరంపేట(మెదక్): అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. మండలంలోని గజగట్లపల్లి గ్రామానికి చెందిన పసుల రమేశ్ (26) గత మంగళవారం గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలు పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ శంకర్ అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం జరిగే మొహర్రం, తొలి ఏకాదశి పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించొవద్దని సూచించారు.

◆ పార్టీ బలోపేతానికి కృషి

రామాయంపేట(మెదక్): గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్ సూచించారు. సోమవారం రామాయంపేటలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరిచిన ప్రభుత్వ వైఖరిని నిరసనగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు దయానందరెడ్డి, సీనియర్ నాయకులు నవాత్ రాజేంద్రప్రసాద్, శంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

◆ 'వారిపై చర్యలు తీసుకోండి'



మెదక్ మున్సిపాలిటీ: అశ్వరావుపేట దళిత ఎస్సై శ్రీరాములు శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని దళిత సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులైన ఉన్నతాధికారులపై హత్యకేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు.

◆ ఆలయాల నిర్మాణానికి స్థల విరాళం

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలో పెద్దమ్మ, గంగమ్మ తల్లి ఆలయాల నిర్మాణానికి రూ.30లక్షల విలువ చేసే 6గుంటల స్థలాన్ని కిషన్‌రావు కులకర్ణి కుటుంబ సభ్యులు సోమవారం విరాళంగా ఇచ్చారు. అలాగే ఆలయాల నిర్మాణాలకు వారు శంకుస్థాపన చేశారు.

◆ భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

చేగుంట(తూప్రాన్): మొహర్రం పండుగ ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు పీర్లను వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పీర్లకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముస్లింలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.